క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలోని శివాలయ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.రెండు లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల జీర్ణోద్ధరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేశ్వర్, వెంకటేశ్, అంజయ్య, యాదయ్య, మల్లికార్జున్‌అయ్యగార్, వెంకటయ్యగౌడ్, మల్లప్ప, మల్లేశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్‌కు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య సహాయకులు కొత్త మల్లేశ్, శ్రావణిల ఆధ్వర్యంలో 190 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 35 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో సికింద్రాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మల్లేశ్ మాట్లాడుతూ.. పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ప్రతి నెలా మొదటివారంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న డప్పు కళాకారులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు బాలరాజ్ అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం బాధిత కుటుంబానికి డప్పు కళాకారుల సంఘం రూ.పది వేల ఆర్థికసాయం అందజేసింది. బాలరాజ్ 22 ఏళ్ల పాటు డప్పు కళాకారుడిగా గుర్తింపు పొంది, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారని డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాండ్ర అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో కళాకారులు మహేష్, రాజు, కృష్ణ, వంశీ, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు



వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

యాచారం: మద్యం తాగి వాహనాలు నడిపితే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పీఎస్ ఎదుట సాగర్‌రోడ్డుపై మంగళవారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పోరులో గెలవాలి

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన పట్టణ పార్టీ కార్యవర్గ సభ్యులకు పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్న తరుణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. పార్టీ నాయకులు అన్ని స్థానాల్లో విజయం సాధించాలని సూచించారు. ప్రతి నాయకుడు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

‘అతిథి’... ఇదేం గతి!

ప్రజాధనం నిరుపయోగం అవుతోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన అతిథిగృహం ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా దిష్టిబొమ్మలా గెస్ట్‌హౌస్ దర్శనమిస్తోంది.

- యాచారం గెస్ట్‌హౌస్‌కు గ్రహణం వీడేదెన్నడో
- పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



యాచారంలో ప్రారంభానికి నోచుకోని జెడ్పీ అతిథిగృహం



వాడుకలో లేక చెదలు పడుతున్న డోరు



దుమ్ముధూళితో ఫర్నిచర్

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మండల కేంద్రంలో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం(గెస్ట్‌హౌస్) ప్రారంభానికి గ్రహణం వీడే పరిస్థితులు ఇప్పట్లో కనిపించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నా అతిథిగృహం తలరాత మాత్రం మారడం లేదు. రూ.25 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన ఈ భవనం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకునే దుస్థితి నెలకొంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ కాల పరిమితిలో మండల కేంద్రంలో అతిథి గృహం ఉండాలనే ఉద్దేశంతో మండల పరిషత్ సముదాయ ఆవరణలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.25 లక్షలకు పైగా జెడ్పీ నిధులతో పనులు ప్రారంభించారు. 2015లో పనులు ప్రారంభిస్తే, నిర్మాణం పూర్తి చేసుకోవడానికి మూడేళ్ల సమయం పట్టింది. అప్పటి నుంచి నిరుపయోగంగా మారింది. భవనంలో చిన్న, చిన్న మరమ్మతులు పెండింగ్‌లో ఉన్నాయి.

మారుతున్న అధికారులు

మండల కేంద్రంలో జెడ్పీ అతిథిగృహం నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుంచి ఎందరో అధికారులు, ప్రజాప్రతినిధులు మారిపోయారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు మరో రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే కొత్తగా ఎంపీపీ, జెడ్పీటీసీలు కూడా వచ్చే అవకాశం ఉంది. మండల పరిషత్ సముదాయ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయ భవనం పక్కనే దిష్టిబొమ్మల్లా ఈ భవనం కనిపిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రారంభానికి ముందే ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని విషసర్పాలు, పక్షులకు నిలయంగా మారింది. రూ.లక్షలాది విలువ చేసే తలుపులు, కిటికీలు, విలువైన ఫర్నిచర్ చెదలు పట్టి పాడై పోతున్నాయి.

ప్రముఖుల పర్యటనలు

యాచారానికి తరచూ వివిధ సంక్షేమ పథకాల పరిశీలనకు రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఇతర ప్రముఖులు వస్తుంటారు. ఇక్కడి నుంచి నాగార్జునసాగర్ వరకు ఎక్కడా అతిథి గృహమే లేదు. మండల కేంద్రంలో గెస్ట్ హౌస్ వాడుకలోకి వస్తే వీఐపీలకు పర్యటనల సమయంలో సేద తీర్చుకోవడమే కాక, అధికారులతో సమీక్షలు జరుపుకొనే అవకాశం ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం పర్యటనలు చేస్తారు. భోజన సమయంలో ఏదో ఒక గ్రామంలో ప్రైవేట్ వెంచర్లు, ఇళ్ల వద్ద సేద తీరి అధికారులు, ప్రజాప్రతినిధులు, విలేకరులతో మాట్లాడుతారు. అదే ఈ అతిథిగృహం వాడుకలోకి వస్తే సమీక్షలు జరుపుకొనే అవకాశం ఉంటుంది. కానీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఈ అతిథిగృహం విషసర్పాలకు, పక్షులకు నిలయంగా మారుతుంది.

> **పనుల పూర్తికి కృషి**
>
> 
>
> మండల కేంద్రంలో ప్రారంభానికి నోచుకోని జెడ్పీ అతిథిగృహం ప్రారంభం విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్తా. పంచాయతీరాజ్ శాఖ అధికారులను పిలిపించుకొని భవనంలో ఏఏ మరమ్మతులు పూర్తి చేయాలో నివేదిక తెప్పించుకుంటా. ఎన్ని నిధులు అవసరమవుతాయో గుర్తిస్తా. నిధులు మంజూరు చేయించి అసంపూర్తి పనులు చేయిస్తా.
>
> – రాధారాణి, ఎంపీడీఓ, యాచారం

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



ఇబ్రహీంపట్నం: లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పుట్ట వద్ద భక్తుల పూజలు



కడ్తాల్: మైసిగండి మైసమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పర్వదినాన్ని మంగళవారం ఇబ్రహీంపట్నంలో ప్రజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పెద్దఎత్తున ఆలయాలకు క్యూ కట్టారు. భవాని నాగలింగేశ్వర స్వామి, లక్ష్మీనృసింహస్వామి, వీరభద్రశ్వర ఆలయాల్లో నాగ దేవతలకు పాలు పోసి మహిళలు పూజించారు.

మైసిగండి ఆలయంలో...

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మైసిగండి మైసమ్మ ఆలయంలోని నాగదేవతను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతకు పాలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మైసమ్మ దేవతను దర్శించుకుని పూజలు జరిపారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. నాగుల పంచమి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

‘ఆదర్శ’ విద్యార్థులకు మాక్ డ్రిల్



విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

శంకర్‌పల్లి: అగ్ని ప్రమాదం, విపత్తు నిర్వహణ తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంగారెడ్డి జిల్లా బీడీయల్ భానూర్‌కి చెందిన సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ విభాగం మంగళవారం పట్టణంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఫైరింగ్, విపత్తుపై అవగాహన కల్పించి, ప్రత్యక్షంగా విద్యార్థులకు చూపించారు. అనంతరం డిప్యూటీ కమాండెంట్ శ్రీరాం తేజస్వీ, అసిస్టెంట్ కమాండెంట్ అర్షద్ అలీఖాన్ మాట్లాడుతూ.. ఎక్కడైనా విపత్తులు సంభవించినప్పుడు ముందుగా భయాందోళనకు గురికాకుండా, సమయస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా ఈ విపత్తుకు తగ్గట్లు తప్పించుకునేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ.. సీఐఎస్ఎఫ్ వారు ఇలాంటి కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందని, మున్ముందు మరిన్నీ చేపట్టాలని ఆకాంక్షించారు.

నష్ట పరిహారం పెంచాలి

హైటెన్షన్ విద్యుత్ లైన్ బాధిత రైతులు

కడ్తాల్: బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా తమకు నష్ట పరిహారం పెంచి ఇవ్వాలని 765 కేవీ బీదర్–మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం సమీపంలో కొనసాగుతున్న హైటెన్షన్ లైన్ ఏర్పాటు పనుల వద్ద బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లోని రైతుల వ్యవసాయ పొలాల మీదుగా 765 కేవీ బీదర్–మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో తీవ్రంగా నష్ట పోతున్నామన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న పరిహారం బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా లేదన్నారు. హైటెన్షన్ లైన్ ఏర్పాటుతో రైతులు తమ పొలాలను వ్యవసాయానికి వినియోగించుకోక పోగా, క్రయ విక్రయాలకు వీలు లేకుండా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరను అనుసరించి పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు మద్దతు పలికారు. కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, ,పెంటారెడ్డి, శ్రీరాములుగౌడ్, రమేశ్, పర్వత్‌కుమార్‌యాదవ్, రాజేందర్‌యాదవ్, రాములు, కేశవులుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అభిలాష్‌రెడ్డి, రాజు, కృష్ణయాదవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు, నాయకులు

రేపు గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ గురుకుల బాలికల, బాలుర విద్యాలయాల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లను గురువారం చేపట్టనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులను స్వీకరించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సీట్లను కేటాయించనున్నట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీరామ్ శ్రీనివాస్, లీలావతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్

మంచాల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని ఈ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరూరి ప్రసన్నకుమార్ శర్మ కోరారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన పాదయాత్ర ఆనాడు కాంగ్రెస్ పార్టీకి జీవం పోసిందన్నారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్ర నూతనోత్తేజాన్ని నింపుతుందన్నారు. ప్రజలు, కార్యకర్తలకు భరోసా నింపడానికే కాంగ్రెస్ యాత్రతో ముందుకు వస్తుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఆగస్టు 2వ తేదీన మొయినాబాద్‌లో నిర్వహించే సీపీఐ 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి కోరారు. మంగళవారం చేవెళ్లలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు ముఖ్య అతిథిగా వస్తున్నారని, జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో పార్టీని పటిష్టం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం , ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మంజుల, కృష్ణగౌడ్, లలిత, నర్సయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సీత్లా సంబరాలు



మేడిగడ్డతండాలో వేడుకలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డతండాలో మంగళవారం గిరిజనులు నిర్వహించిన సీత్లా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని తలపై ఉంచుకుని ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భవానీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజే హోరులో యువతీ యువకుల నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల్లో రవీందర్‌నాయక్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు అంబర్‌సింగ్, మల్లేశ్, పాండు, శంకర్, పత్యానాయక్, సురేశ్‌నాయక్, హన్మనాయక్, కృష్ణ, తావుర్యానాయక్, శంకర్‌నాయక్, విజయ్‌రాథోడ్, ఫరిద్, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చంద్రాయణపల్లి తండాలో గిరిజనులు సీత్లా సంబరాలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు లచ్చిరాంనాయక్, రమేశ్‌నాయక్, పంతునాయక్, కుమార్‌నాయక్, నిరంజన్ నాయక్, గోపాల్, శ్రీకాంత్, శ్రీను, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసిందని చెప్పారు. గతంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను అందించిందని చెప్పారు. అనంతరం మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన ఇటిక్యాల మాణిక్యమ్మ మృతి చెందడంతో మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ప్రముఖ అడ్వకేట్ యాదీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సరిపడా ఎరువుల నిల్వలు



తలకొండపల్లిలో ఎరువుల దుకాణంలో నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ



మాడ్గుల: షాపులో యూరియా బస్తాలను తనిఖీ చేస్తున్న ఏఓ

ఆమనగల్లు: తలకొండపల్లి మండలంలో రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన యూరియా సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయాధికారి రేణుకా చక్రవర్తిని తెలిపారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. తలకొండపల్లి మండలంలో పీఏసీఎస్ ద్వారా తలకొండపల్లి, పడకల్ గ్రామాలలో యూరియా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎరువుల డీలర్ల వద్ద, ఆగ్రో కేంద్రాల వద్ద యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాల వద్ద కూపన్ల విధానం ద్వారా ప్రతి రైతుకు 3 బస్తాల చొప్పున యూరియా సరఫరా చేస్తున్నామని చెప్పారు. రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

స్టాక్ బోర్డులు ఉండాలి

మాడ్గుల: యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. షాపు యజమానులు స్టాక్ బోర్డు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దుకు రాజీలేని పోరాటం



జన్వాడ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూటీఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని, దాంట్లో భాగంగా సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జన్వాడ, శంకర్‌పల్లి, టంగటూర్ తదితర గ్రామాల పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్, హెల్త్‌కార్డులు, ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులు, డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు రాములు, సంజీవరావు, రమా, మల్లేశం, హరికృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

గ్రీన్ ఫార్మాసిటీ నూతన సీఐగా సత్యనారాయణ

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎల్బీనగర్ సైబర్ క్రైమ్‌లో సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణ ఇక్కడికి రానున్నారు. సీఐ కృష్ణంరాజు సైబర్ క్రైమ్స్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో నేతలు మంగళవారం పీఎస్‌లో సీఐ కృష్ణంరాజుతో పాటు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ తేజంరెడ్డిని సత్కరించి వీడ్కోలు పలికారు. ఎస్ఐ తేజంరెడ్డి గుండాల పీఎస్‌కు ఎస్‌హెచ్ఓగా బదిలీ కాగా, అక్కడి నుంచి సైదులు గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌కు బదిలీపై వస్తున్నారు.

ఆదిబట్ల సీఐగా రవికుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా బి.రవికుమార్ మంగళవారం నియమితులయ్యారు. నిన్నటివరకు ఎస్‌హెచ్ఓగా పని చేసిన రాఘవేందర్‌రెడ్డిని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. చర్లపల్లి ఠాణాలో సీఐగా పని చేసిన రవికుమార్ బదిలీపై ఆదిబట్ల ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. గత 19 నెలలుగా ఆదిబట్ల పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేసిన వారికి రాఘవేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



యాచారం: బదిలీపై వెళ్తున్న సీఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న సీపీఎం నేతలు